## క్లుప్తంగా

### ఆర్థికసాయం



నగదు అందిస్తున్న తూడి లచ్చన్న

గంగాధర: మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన పలువురికి సామాజిక కార్యకర్త తూడి లచ్చన్న శుక్రవారం ఆర్థికసాయం చేశారు. పిట్టలపల్లి గ్రామానికి చెందిన గోదల కమలాకర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించగా ఆయన కుటుంబాన్ని పరామర్శించి రూ.పదివేలు అందించాడు. వెంకంపల్లి గ్రామానికి చెందిన సంకటి అనిల్ అనే యువకుడు రోడ్డు ప్రమాదంలో కాలు కోల్పోగా పరామర్శించి రూ.పదివేలు అందజేశాడు.

### మహిళా వారోత్సవాలు

శంకరపట్నం: మండలంలోని కొత్తగట్టు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మహిళా వారోత్సవాలు నిర్వహించారు. స్నేహిత కార్యక్రమంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్వైజర్ కవిత మాట్లాడారు. చెడు అలవాట్లకు పిల్లలు దూరంగా ఉండాలని, పరిశుభ్రత పాటించాలని తెలిపారు. ఈకార్యక్రమంలో హెచ్ఎం శ్రీలత, స్వప్న, భారతి, విజయ తదితరులు పాల్గొన్నారు.

### తహసీల్దార్‌కు ఫిర్యాదు

వీణవంక: మండలంలోని దేశాయిపల్లి గ్రామానికి చెందిన కాంపెల్లి కొంరమ్మతో పాటు పలువురు రైతులు గ్రానైట్ క్వారీ నిర్వాహకులు వ్యవసాయ భూమిని ఆక్రమించుకున్నారని శుక్రవారం తహసీల్దార్ తిర్మల్‌రావుకు ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ... కోర్కల్ రెవెన్యూ పరిధిలో 30ఏళ్లుగా వ్యవసాయం చేసుకుంటున్నామని, గ్రానైట్ నిర్వాహకులు భూమిని ఆక్రమించుకొని చంపుతామని బెదిరిస్తున్నారని ఆరోపించారు. క్వారీ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని వేడుకున్నారు. బెదిరింపులకు పాల్పడితే దళిత సంఘాలతో కలిసి ఉద్యమిస్తామని హెచ్చరించారు.

### ఆరోపణలు సరికాదు

వీణవంక: కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 70 రోజులు గడవకముందే ఆరోపణలు చేయడం సరికాదని కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు నల్ల కొండాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని దేశాయిపల్లి గ్రామంలో మాట్లాడారు. బీఆర్ఎస్ నాయకులు మేడిగడ్డకు వెళ్లడం సిగ్గుచేటని, రూ.లక్షల కోట్లు పెట్టి నిర్మిస్తే ప్రజలకు ఎందుకు ఉపయోగపడకుండా పోతున్నాయని ఆరోపించారు. తప్పును కప్పి పుచ్చుకునేందుకు మేడిగడ్డకు వెళ్లారని, ఎప్పటికైనా బీఆర్ఎస్ ప్రభుత్వ అవినీతి బట్టబయలవుతుందన్నారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్‌తోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని, ఆరు గ్యారంటీలు త్వరలోనే అన్నీ అమలు అవుతాయని అన్నారు.

### సేంద్రియ వ్యవసాయానికి మొగ్గుచూపాలి



మాట్లాడుతున్న డీడీఏ ఛత్రునాయక్

శంకరపట్నం: రైతులు సేంద్రియ వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని డీడీఏ ఛతునాయక్ అన్నారు. మండలంలోని మెట్‌పల్లి రైతువేదికలో శుక్రవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పంటలు, ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో మాట్లాడుతూ జీలుగ, జనుము, పచ్చిరొట్ట, పెసరలతో పంటలను సాగుచేస్తే భూమిలో సేంద్రియ ఎరువులు తయారవుతాయన్నారు. ఈకార్యక్రమంలో ఏఓ శ్రీనివాస్, కేవీకే శాస్త్రవేత్త శ్రీనివాస్, ఏఈఓ రాజ్‌కుమార్, సునీల్, తదితరులు పాల్గొన్నారు.

### పశువైద్య శిబిరాలు ప్రారంభం



టీకా వేస్తున్న వైద్యాధికారి మాధవరావు

గంగాధర: పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయడానికి శుక్రవారం మండలంలోని కురిక్యాల గ్రామంలో పశువైద్య శిబిరాన్ని పశువైద్యాధికారి శ్రీనివాస్ ప్రారంభించారు. 454 పశువులకు టీకాలు వేశామని, ఈనెల 31 వరకు ప్రతి గ్రామంలో వైద్య శిబిరాలు నిర్వహించి పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తామన్నారు. రైతులు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

**పశువులకు టీకాలు**

శంకరపట్నం: మండలంలోని కొత్తగట్టు గ్రామంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశామని డాక్టర్ మాధవరావు తెలిపారు. ఈకార్యక్రమంలో ఆరిఫ్, అమీర్, మొండయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

# రోడ్డెక్కాలంటే భయం..

- ముమ్మరంగా నేషనల్ హైవే విస్తరణ పనులు
- వాహనాల దారి మళ్లింపుతో అవస్థలు
- ఒకేదారిపై ఇరువైపులా వాహనాలు
- దుమ్ముధూళితో ఇబ్బందులు



ఇరుకుదారిలో వాహనాల రద్దీ



ఈదులగట్టెపల్లి వద్ద వాహనాల డైవర్షన్

మానకొండూర్: మానకొండూర్, శంకరపట్నం మండలాల మీదుగా కొనసాగుతున్న నేషనల్ హైవే 563 విస్తరణ పనులు ఓ వైపు ముమ్మరంగా కొనసాగుతుండగా, మరోవైపు వాహనాల డైవర్షన్, ఒకే దారిపై ఇరువైపుల వాహనాలు వెళ్తుండటంతో ప్రయాణికులు, వాహనదారులు అవస్థలు పడుతున్నారు. రోడ్డుపైకి రావాలంటేనే భయపడుతున్నారు. ఏ సమయాన ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. మానకొండూర్ మండలం ముంజంపల్లి శివారులోని జాలగుట్ట వద్ద నుంచి హైవే పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. మానకొండూర్, శంకరపట్నం, హుజూరాబాద్, ఎల్కతుర్తి, హసన్‌పర్తి మీదుగా హన్మకొండ వరకూ పనులు కొనసాగుతుండగా మానకొండూర్, శంకరపట్నం మండలంలో సుమారు 20 కిలోమీటర్లు పనులు కొనసాగుతున్నాయి. ఈపనులతో వాహనదారులకు అడుగడుగునా ఇబ్బందులే ఎదురవుతున్నాయి. వాహనాల డైవర్షన్, దుమ్ముధూళితో రోడ్డు ప్రమాదాలు జరుగుతాయని భయపడుతున్నారు. ముంజంపల్లి, ఈదులగట్టెపల్లి, ఖాదర్‌గూడెం, శివారులో వాహనాల డైవర్షన్ ఏర్పాటు చేశారు. ఈదులగట్టెపల్లి నుంచి చెంజర్ల, శంకరపట్నం మండలం తాడికల్, కొత్తగట్టు వరకూ సుమారు 15 కిలోమీటర్ల మేర వాహనాలు ఒకే వైపు నుంచి ఇటు కరీంనగర్ అటు వరంగల్ వైపునకు వెళ్తున్నాయి. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. కిలోమీటర్ల మేర ఇరుకైన రహదారిపై వాహనాలు నడపడానికి ఇబ్బందులు పడుతున్నామని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వాహనాల దారిమళ్లింపు కార్యక్రమం చేపట్టగా వాహనాలు కొంతమట్టి, కొంత తారురోడ్డుపై వెళ్తుండంతో దుమ్ముధూళి చెలరేగుతోంది. కనీసం దుమ్ముధూళి లేవకుండా సంబంధిత అధికారులు రహదారిపై నీటిని పట్టించాలని కోరుతున్నారు. ఎప్పుడో ఒక సారి కాకుండా ఎప్పటికప్పుడు నీరు పట్టాలని వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు. ఇరుకైన దారిలో రెండువరుసలుగా వాహనాలు వెళ్తున్నాయి. వాహనాల రద్దీకూడా పెరిగింది. అదుపు తప్పి వాహనాలు ప్రమాదాలకు గురైతే ఇతర మార్గాల్లో వాహనాలను మళ్లించడానికి అవకాశం లేదు. కల్వర్టులు పనులు అసంపూర్తిగా ఉన్నాయి. ప్రమాదాలు జరిగితే గంటల తరబడి వాహనాల ట్రాఫిక్ జామ్ అయ్యే అవకాశం ఉంది. అధికారులు తగు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

### చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాగరాజు

చొప్పదండి: పట్టణంలోని ప్రధాన రహదారి పక్కన ఏర్పాటు చేసిన వేసవి చలివేంద్రాన్ని మున్సిపల్ కమిషనర్ కీర్తి నాగరాజు శుక్రవారం ప్రారంభించారు. కాంగ్రెస్ నాయకులు నిజానపురం చందు సహకారంతో 300 మందికి మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ ప్రశాంత్‌కుమార్, సభ్యులు మహేశుని మల్లేశం, జిట్ట కుమార్, మహమ్మద్ చాంద్ పాషా, వోదెల రవికాంత్, అమరగొండ శ్రీనివాస్, పొన్నం శ్రీనివాస్ పాల్గొన్నారు.

### ముగ్గురు డిబార్

సైదాపూర్: మండలంలోని సైదాపూర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇంటర్ పరీక్షలు రాస్తున్న ముగ్గురు విద్యార్థులు(బాలురు) డిబార్ అయినట్లు స్క్వాడ్ బృందం ప్రతినిధులు రవీందర్‌రెడ్డి, ఆంజనేయరావు తెలిపారు. ముగ్గురు విద్యార్థులు కాపీ కొడుతుండగా దొరికిపోయారని వారిని డిబార్ చేసినట్లు స్క్వాడ్ బృందం తెలిపింది.

# మమ అనిపించారు..

- 38 నిమిషాల్లోనే ముగిసిన జమ్మికుంట మున్సిపల్ సమావేశం
- కాంగ్రెస్ కౌన్సిలర్ల నిరసన



మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ కౌన్సిలర్లు



మాట్లాడుతున్న చైర్మన్ రాజేశ్వర్‌రావు

జమ్మికుంట: ఎజెండా చదవకుండానే 38 నిమిషాల్లో కౌన్సిల్ సమావేశం ముగించారని, కాంగ్రెస్ పార్టీకి చెందిన 14మంది కౌన్సిలర్లు నిరసన వ్యక్తం చేశారు. శుక్రవారం జమ్మికుంట మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ రాజేశ్వర్‌రావు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. బీఆర్ఎస్ కౌన్సిలర్లు 13 మంది హాజరై 30 అంశాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. కాగా మున్సిపల్ సమవేశ మందిరానికి కాంగ్రెస్ పార్టీకి చెందిన 14 మంది కౌన్సిలర్లు చేరుకునే సరికే సమావేశం ముగిసిందని ప్రకటించడంపై కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం కౌన్సిలర్లు కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమావేశానికి వస్తున్నామని కమిషనర్ అయాజ్‌కు సమాచారం అందించినా తూతూ మంత్రంగా తీర్మానాలు చదవకుండానే ఎలా ముగిస్తారని మండిపడ్డారు. ప్రతిసారి రెండు గంటలు సమావేశం జరిగేదని, కౌన్సిల్‌లో ప్రజా సమస్యలు మాట్లాడే అవకాశం ఇవ్వకుండా చేశారని, నిధులు దుర్వినియోగం చేసేందుకే త్వరగా సమావేశం ముగించారని ఆరోపించారు. గత తీర్మానాలు మళ్లీ ఎజెండాలో పెట్టి ఆమోదించారని, నిధుల దుర్వినియోగం, సమావేశం నిర్వహణపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. కాగా కమిషనర్ అయాజ్‌ను వివరణ కోరగా రెండుసార్లు వచ్చిన బిల్లులను తొలిగిస్తామని తెలిపారు. కౌన్సిల్ సమావేశం నిర్ణయించిన సమయంలో కోరంతోనే పలు అంశాలపై ఆమోదం తెలిపాం, 1/3 కౌన్సిలర్లు హాజరయ్యారని వారితో చర్చించి బిల్లులు ఆమోదించామని మున్సిపల్ చైర్మన్ రాజేశ్వర్‌రావు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, మేనేజర్ భూపాల్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

### అభివృద్ధి పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సత్యం

గంగాధర: మండలంలోని కాసారం, వెంకంపల్లి, గోపాల్‌రావుపల్లి, మల్లాపూర్ గ్రామాల్లో సీసీ రోడ్డు పనులను శుక్రవారం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీలను అమలు చేస్తుందన్నారు. అర్హులైన ప్రతి వ్యక్తికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. గ్రామాల్లోని సమస్యల పరిష్కారానికి, అభివృద్ధి పనులు చేయడానికి తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### మృతులకు నివాళి



నివాళి అర్పిస్తున్న నాయకులు

హుజూరాబాద్: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ కోసం మృతిచెందిన వారికి శుక్రవారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీల ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. ఎస్సీ వర్గీకరణ కోసం 30 ఏళ్లుగా మాదిగలు పోరాటం చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు రామచంద్రం, శ్రీనివాస్, వసంత్, రవీందర్, ఉద్యోగ సంఘం నాయకులు సారయ్య, శేఖర్, ప్రభాకర్, రాజయ్య, భువనచంద్ర, దేవేందర్, సమ్మయ్య, రాజు పాల్గొన్నారు.

### రేషన్ బియ్యం పట్టివేత

జమ్మికుంట: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకొని ఓ వ్యక్తిపై కేసు నమోదు చేశామని టౌన్ సీఐ వరగంటి రవి శుక్రవారం తెలిపారు. పట్టణంలోని మారుతీనగర్‌కు చెందిన ఓ వ్యక్తి ఏడు క్వింటాళ్ల రేషన్ బియ్యం సేకరించి, మడిపెల్లి రైల్వేగేటు సమీపంలో అక్రమంగా తరలించేందుకు ప్రయత్నిస్తుండగా సీఐ ఆదేశాల మేరకు బ్లూకోల్ట్స్ పోలీసులు పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

### ఎక్సైజ్ సీఐకి సన్మానం



సీఐని సన్మానిస్తున్న గీతకార్మిక సంఘం నాయకులు

జమ్మికుంట: పట్టణంలోని ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో సీఐ, ఎస్ఐలుగా బాధ్యతలు చేపట్టిన మాధవిలత, సౌమ్యను సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం నాయకులు శుక్రవారం ఘనంగా శాలువాతో సన్మానించారు. గీత కార్మికుల సమస్యలు, ప్రమాద బీమాకు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుచ్చయ్యగౌడ్, జిల్లా అధికార ప్రతినిధి నర్సయ్యగౌడ్, ప్రధాన కార్యదర్శి కొమురయ్యగౌడ్, యూత్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, కోశాధికారి వీరస్వామిగౌడ్, జమ్మికుంట, ఇల్లందకుంట, వీణవంక మండలాల అధ్యక్షులు పూదరి విజయ్‌గౌడ్, దేవేందర్‌గౌడ్, దొమ్మటి రాజమౌళి, గీత కార్మిక సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

### ఉద్యోగాలు సాధించిన విద్యార్థులకు...



విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపకులు

జమ్మికుంట: పట్టణంలోని విజ్ఞాన్ జూనియర్ కళాశాలలో ఒకేషనల్ కోర్సు ఎంపీహెచ్‌డబ్ల్యూ మల్టీపర్పస్ హెల్త్‌వర్కర్స్ కోర్సు పూర్తి చేసుకున్న విద్యార్థులు ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నర్సింగ్ ఆఫీసర్, కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. మారబోయిన రేణుక, అగ్గి నవ్య, ఒజ్జ కోమల, బుర్ర శ్రీలేఖ, గూడపాటి పద్మారెడ్డి, లావణ్య, ప్రవంతిని కళాశాల చైర్మన్ దబ్బెట విజయలక్ష్మి రవీందర్, వైస్ చైర్మన్ బండి అరుణప్రభాకర్, కరస్పాండెంట్ మల్లారెడ్డి, ప్రిన్సిపల్ కూర విజేందర్‌రెడ్డి, అధ్యాపకులు శుక్రవారం అభినందించి సన్మానించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. ఒకేషనల్ కోర్సులో చదువుకున్న విద్యార్థులు విద్యతో పాటు కెరీర్ గైడెన్స్ ఉండడం వల్ల వెంటనే ఉద్యోగాలు సాధించడం జరిగిందన్నారు. పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌పై విద్యను అందిస్తూ విద్యార్థుల కలలను కళాశాల సాకారం చేస్తుందన్నారు. కార్యక్రమంలో పాకాల శ్రీనివాస్‌రెడ్డి, కాంతాల మల్లారెడ్డి, అధ్యాపకులు మంజుల, చింతల రాజేందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### గ్రామస్తుల అభినందనలు

వీణవంక: మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన సజ్జనపు మనోజ్‌కుమార్ శ్రీపొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం 16వ స్నాతకోత్సవంలో గవర్నర్ తమిళిసై చేతుల మీదుగా ఉత్తమ విద్యార్థిగా ప్రశంసాపత్రం అందుకున్నారు. ఈసందర్భంగా గ్రామస్తులు శుక్రవారం మనోజ్‌కుమార్‌ను ఘనంగా సన్మానించారు. ఎంఏ లింగ్విస్టిక్స్( భాషా శాస్త్రంలో )విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచాడు. గ్రామస్థాయి నుంచి ఎలాంటి కోచింగ్ లేకుండా ప్రథమ స్థానంలో నిలవడం పట్ల గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పద్మకుమార్, మొండయ్య, శ్రీనివాస్, శ్రీనివాస్, బండారి సంపత్, తదితరులు ఉన్నారు.

### మెగా డీఎస్సీ హర్షణీయం



సైదాపూర్: మెగా డీఎస్సీ ప్రకటన హర్షణీయమని తెలంగాణ పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె శ్రీనివాస్, మండల అధ్యక్షుడు నెల్లి ప్రవీణ్ హర్షం వ్యక్తం చేశారు. నిరుద్యోగులు అడగకుండానే 11,062 టీచర్ ఉద్యోగాలకు నోటిఫికేషన్ వేసి పాఠశాల విద్యను బలోపేతం చేయడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయం తీసుకున్నందుకు పీఆర్టీయూ తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శి సోయం రమేశ్, మండల ఉపాధ్యాయ నాయకులు , తదితరులు ఉన్నారు.

### నూతన ఎన్నికలు



పర్కాల ఎల్లయ్య



గట్టు నాగయ్య

మానకొండూర్: మండలంలోని గట్టుదుద్దెనపల్లి శ్రీప్రసన్నాంజనేయస్వామి పురుషుల పొదుపు సంఘం, వీరాంజనేయ పురుషుల పొదుపు సంఘం ఎన్నికలు శుక్రవారం జరిగాయి. ఈ సందర్భంగా శ్రీప్రసన్నాంజనేయ పురుషుల పొదుపు అధ్యక్షుడిగా పర్కాల ఎల్లయ్య, ఉపాధ్యక్షుడిగా ఆకుల తిరుమల్‌రావు, నూతన డైరెక్టర్లుగా పెంచాల రంగయ్య, పెంచాల జలపతి, బొద్ల రాజు, కోల శ్రీనివాస్ డైరెక్టర్లుగా ఎన్నిక కాగా, వీరాంజనేయ పురుషుల పొదుపు సంఘం అధ్యక్షుడిగా గట్టు నాగయ్య, 12 మంది డైరెక్టర్లుగా ఎన్నికయ్యారు. గుంటి వెంకటేశ్, పల్లె అంజి ఎన్నికల అధికారిగా వ్యవహరించారు.

### 8న నియోజకవర్గ సదస్సు



మాట్లాడుతున్న అనిల్ మాదిగ

మానకొండూర్: మార్చి 8న కరీంనగర్‌లో జరిగే ఎమ్మార్పీఎస్ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ సదస్సును విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అనిల్ మాదిగ సూచించారు. ఎమ్మార్పీఎస్ ఉద్యమాన్ని నిర్మాణాత్మకంగా బలోపేతం చేసేందుకు మానకొండూర్ మండల కేంద్రంలోని మార్కెట్‌యార్డులో నియోజకవర్గ కార్యకర్తలతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. మూడు దశాబ్దాలుగా సుదీర్ఘంగా కొనసాగుతున్న ఎమ్మార్పీఎస్ ఉద్యమం తుది దశకు చేరుకుందన్నారు. సుప్రీంకోర్టులో న్యాయ ప్రక్రియ పూర్తి చేసుకొని చివరి అంకానికి చేరుకున్న దశలో చేయాల్సిన బాధ్యతలు, కర్తవ్యం గుర్తు చేశారు. భవిష్యత్ కార్యాచరణను వివరించారు. కార్యక్రమంలో ఆంజనేయులు, అంజిబాబు, అంజమ్మ, రవి, శ్రీనివాస్, అనిల్, మహేశ్ పాల్గొన్నారు.

### పల్స్‌పోలియో కార్యక్రమం విజయవంతం చేయాలి

హుజూరాబాద్: ఈ నెల 3న డివిజన్ వ్యాప్తంగా నిర్వహించే పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, తల్లిదండ్రులు చిన్నారులకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో చందు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. డివిజన్ పరిధిలోని సైదాపూర్,శంకరపట్నం, హుజురాబాద్ అర్బన్, చెల్పూర్, చల్లూరు, వీణవంక, ఇల్లందకుంట, వావిలాల, జమ్మికుంట అర్బన్ ప్రాంతాల పరిధిలో పల్స్ పోలియో కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. 22,653 మంది ఐదేళ్లలోపు పిల్లలు ఉన్నారని, డివిజన్ పరిధిలో 185 బూత్‌ల్లో 800 మంది సిబ్బంది 20 రూట్లలో 9 మొబైల్ టీములు ఏర్పాటు చేశామని, దాదాపు 42 హైరిస్క్ ఏరియాస్‌లోని పిల్లలందరికీ చుక్కలు వేస్తామని తెలిపారు.

### టీచర్, హెల్పర్ పోస్టులు ఖాళీ



మాట్లాడుతున్న సీడీపీఓ సబిత

శంకరపట్నం: మండలంలోని అంగన్‌వాడీ సెంటర్లలో టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని సీడీపీఓ సబిత అన్నారు. తాడికల్, కేశవపట్నం, కరీంపేట, లింగాపూర్, అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్, వంకాయగూడెం, తాడికల్, మొలంగూర్, మెట్‌పల్లి, ఆముదాలపల్లి, కొత్తగట్టు గ్రామాలలో హెల్పర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు.

### వెంకట్రాజం మృతిపట్ల సంతాపం

సైదాపూర్/హుజూరాబాద్: మండలంలోని ఎగ్లాస్‌పూర్ గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు, సీనియర్ ఎస్టీయూ నాయకుడు ఆకుబత్తిని వెంకట్రాజం మృతి పట్ల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పీ.ఆర్ శ్రీనివాస్, రవీంద్రాచారిలు సంతాపం శుక్రవారం తెలిపారు. వెంకట్రాజం హిందీ ఉపాధ్యాయుడిగా, ఉపాధ్యాయ, విద్యా రంగాలకు విశేష సేవలందించారని గుర్తు చేశారు. సమితి, జిల్లా, రాష్ట్ర కమిటీల్లో బాధ్యతలు నిర్వహించి, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేశారని పేర్కొన్నారు. సంతాపం వ్యక్తం చేసిన వారిలో జిల్లా నాయకులు భాస్కర్, బాలాజీ, కోట శ్యాంకుమార్, పురుషోత్తం, మూర్తి, రాజ్‌కుమార్, శ్రీనివాస్, మనోహర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

### పరీక్ష ప్యాడ్లు పంపిణీ



పరీక్ష ప్యాడ్లతో విద్యార్థులు, అనిల్ గౌడ్

తిమ్మాపూర్: మండలంలోని మన్నెంపల్లి గ్రామానికి చెందిన పొన్నం యువసేన ఆధ్వర్యంలో శుక్రవారం మండల వ్యాప్తంగా పలు కార్యక్రమాలు నిర్వహించారు. మాజీ ఉపసర్పంచ్ పొన్నం అనిల్ గౌడ్ లయన్స్ క్లబ్ సహకారంతో కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారి కుటుంబ సభ్యులకు అన్నదానం చేశారు. తిమ్మాపూర్ మండలం మన్నెంపల్లి ప్రభుత్వ పాఠశాల పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, సామగ్రి అందించారు. కార్యక్రమంలో యూత్ నాయకులు దరిపల్లి వేణుకుమార్, సుధగోని సదయ్య గౌడ్, కామేర నిరంజన్, బీనపల్లి సంపత్, గీకురు రమేష్, గొల్లే సాయి కుమార్, గొదరి నాగేంద్ర, నాంపల్లి సాయి కుమార్, గుంటి నవీన్ పాల్గొన్నారు.

### విద్యార్థులకు వరం స్నేహిత

సాక్షి నెట్‌వర్క్: చొప్పదండి, హుజూరాబాద్, మానకొండూర్ నియోజకవర్గాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం స్నేహిత కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు స్నేహిత కార్యక్రమం వరమని, ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారులు తెలిపారు. సమస్యలను ధైర్యంగా చెప్పి మంచి, చెడులపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. విద్య ప్రాముఖ్యతను వివరించారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి వివరించి, ఇంటర్నెట్ వలన దుష్ఫలితాలు వివరించారు. న్యూట్రిషన్ ఫుడ్, మహిళా సాధికారత, బాల్య వివాహాలు, 1098 హెల్ప్‌లైన్ నంబర్ పై అవగాహన కల్పించారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, వ్యక్తిగత , పరిసరాల పరిశుభ్రత, జ్ఞాపకశక్తిని పెంపొందించే ఫొటోగ్రాఫిక్‌మెమొరీ, ఆత్మరక్షణ గురించి వివరించారు. ప్రతి పాఠశాలలో ఈ కార్యక్రమం నిర్వహించాలన్నారు.



వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

### కరాటేలో విద్యార్థుల ప్రతిభ

గంగాధర: మండలంలోని గర్శకుర్తి గ్రామానికి చెందిన సరస్వతి విద్యాలయం విద్యార్థులు కరాటేలో ప్రతిభ కనబరిచి సర్టిఫికెట్లు, వివిధ రకాల బెల్టులు సాధించారు. ఒకినోవా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ శుక్రవారం స్థానిక ఫంక్షన్‌హాల్‌లో కరాటేలో వివిధ పోటీ పరీక్షలు నిర్వహించారు. ఒకినోవా కరాటే సంస్థల చీఫ్ ఎగ్జామినర్ కె.వసంత్‌కుమార్ విద్యార్థులకు బెల్టులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మిట్టపల్లి రాజశేఖర్, కరాటే శిక్షకుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

### సుందరగిరి పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

తిమ్మాపూర్: చిగురుమామిడి మండలం సుందరగిరి కార్యదర్శి బోయినపల్లి రాజేశ్వరరావుపై వేటు పడింది. ఆయనను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ పమేలా సత్పతి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విషయం శుక్రవారం ఆలస్యంగా వెలుగు చూసింది. పంచాయతీ నిధులు దుర్వినియోగం చేసిన కారణంగా రాజేశ్వరరావును సస్పెండ్ చేస్తున్నట్లు కలెక్టర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రాథమిక విచారణ ఆధారంగా సస్పెండ్ చేశారని, అధికారులు విచారణ చేస్తే మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. సస్పెండ్‌తో సరిపెట్టుకోకుండా లోతుగా విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు అంటున్నారు.